

ధర్నా చేస్తున్న సర్వశిక్షా ఉద్యోగులు

వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సర్వశిక్ష ఉద్యోగులు 32వ రోజు ధర్నాలో భాగంగా వికారాబాద్ పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటే, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 32 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని, ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

» ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 30 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఈవో విజయకుమారిలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంతోష్ రాథోడ్, ఉపాధ్యక్షుడు అరుణ్, సభ్యులు భగత్, శ్యామ్‌రావు, సుబ్బు, అనిల్, రాము, దినేష్, నందీశ్వర్, శ్రీకాంత్‌లతో పాటు సమగ్ర శిక్షా ఉద్యోగులు ఫణికుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్ల సంఖ్య 10 లక్షలు దాటింది. మొత్తం 10,00,851 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇందులో 549 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. జిల్లాలో తొలిసారిగా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా నమోదు కావడం ఇదే తొలిసారి. సాధారణ ఓటర్లలో జిల్లాలో అత్యధికంగా పరిగి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 2,71,060 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 15,031 మంది అధికంగా ఉన్నారు. సర్వీసు ఓటర్లలో అత్యధికంగా పరిగి నియోజకవర్గంలో 247 మంది, వికారాబాద్‌లో 79 మంది, తాండూరులో 53 మంది, కొడంగల్‌లో 170 మంది ఓటర్లు ఉన్నట్లు సోమవారం జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్ ప్రకటించారు.

అతివలే అధికం



జిల్లాలో 10,00,851 మంది ఓటర్లు

4 నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ

ఎస్ఎస్ఆర్ ప్రక్రియ తర్వాత తేలిన లెక్క

గతేడాది 8,81,028 మంది ఓటర్లు

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతేడాది ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 8,81,028 మంది ఉండగా, ఏడాది తర్వాత ఎస్ఎస్ఆర్ ప్రక్రియ అనంతరం 10,00,851 మంది ఓటర్లకు పెరిగారు. ఏడాదిలో జిల్లాలో 1,19,823 మంది ఓటర్లు పెరగగా, పెరిగిన ఓటర్లలో పురుషులు 50,925 మంది, మహిళా ఓటర్లు 68,892 మంది ఉన్నారు. కాగా, ఏడాది కిందట ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 26 మంది ఉండగా,

మిగతా 8వ పేజీలో...

జిల్లాలోని ఓటర్ల వివరాలు	మహిళలు 5,07,644
పురుషులు 4,92,613	మొత్తం 10,00,302
ట్రాన్స్‌జెండర్స్ 45	సర్వీస్ ఓటర్లు 549

నియోజకవర్గాల వారీగా సాధారణ ఓటర్లు

	2024	2025
పరిగి	2,34,385	2,71,060
వికారాబాద్	2,14,447	2,34,933
తాండూరు	2,15,843	2,47,783
కొడంగల్	2,15,791	2,46,526
మొత్తం	8,80,466	10,00,302

మేడ్చల్ ఓటర్లు

29,48,537

పురుషులు 15,17,375

మహిళలు 14,30,746

8

రేపు జిల్లా దిశ సమావేశం

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలపై ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన జిల్లా అభివృద్ధి సమన్వయ సమావేశం(దిశ) దాదాపు నాలుగేళ్ల తర్వాత 8వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో జరుగనుంది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి దిశ మెంబర్ సెక్రటరీ, కలెక్టర్ గౌతమ్‌తో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ ఛైర్మన్‌లు, కార్పొరేషన్‌ల మేయర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై 21 అంశాలపై సమీక్ష జరుపనున్నారు.

'మహిళా శక్తి' ద్వారా ఉచిత కుట్టు మిషన్లు

జిల్లా మైనార్టీ అధికారి హన్మంత్‌రావు

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్‌లు అందిస్తున్నట్లు జిల్లా మైనార్టీ అధికారి కె.హన్మంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగా ఉన్న క్రిస్టియన్ మైనార్టీ మహిళలు జనవరి 20 లోపు ఆన్‌లైన్ టీజీవోబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆహార భద్రత కార్డు లేదా గ్రామీణ నేపథ్యం ఉన్నవారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు మించకుండ ఆదాయం ఉండాలని పేర్కొన్నారు. కనీసం 5వ తరగతి విద్య అర్హత కలిగి 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా నేర్చుకున్న టైలర్ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు కలిగి ఉండాలని ఆయన తెలిపారు. వివరాలకు 7993357103 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



50వేల ఎకరాలకు రైతు భరోసా కట్!

జిల్లాలో 77,984 ఎకరాల భూమి

సాగు కేవలం 19,756 ఎకరాల్లోనే..

ప్రభుత్వానికి ఆదా కానున్న రూ.24 కోట్లు

ప్రభుత్వం నుంచి అందని మార్గదర్శకాలు

బీఆర్ఎస్ హయాంలో అన్ని భూములకూ రైతుబంధు

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా దుర్వినియోగం కాకుండా ఈ పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు ఆదేశించింది. ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాకున్నా అధికారులు మాత్రం రైతు భరోసాకు సాగు భూములను గుర్తించే పనిలో పడ్డారు. సాగు చేసే భూములకు మాత్రమే పెట్టుబడి సాయం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు.కాగా, ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాలకు పైగా రైతుభరోసా కట్ కానున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 77,984 ఎకరాలకు సంబంధించి 40,960 మంది రైతులకు ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.38.99 కోట్లు రైతు బంధు పంపిణీ జరిగింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ. 6 వేల చొప్పున అది కూడా సాగు చేసే భూమికి మాత్రమే చేస్తామని ప్రకటించింది. పది రోజుల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు అందించే సాగు చేసే భూముల

మిగతా 8వ పేజీలో...



మెడికిల్ దందా!

పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు

అర్హత లేకపోయినా మందుల విక్రయాలు

పేదల ప్రాణాలతో చెలగాటం

నిర్వాహకులతో అధికారుల కుమ్మక్కు!

మూడుచింతలపల్లిలో మెడికల్ మాఫియా

7



మార్కెట్‌కు దండిగా కంది

కొనుగోలు కేంద్రంలో అందని 'మద్దతు'

కొర్రీలు పెడుతున్న నిర్వాహకులు

మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ. 8,600

6

వికారాబాద్ కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



సమస్యలను పరిష్కరించాలి

» ప్రజావాణికి 120 ఫిర్యాదులు

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 120 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీఓలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను సూచించారు.

చర్యలను రికార్డు చేయాలి

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి అందించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 114 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

డీపీవో వెంకయ్య బదిలీ

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య బదిలీ అయ్యారు. ఆయన మేడ్చల్ నుంచి నల్గొండ జిల్లాకు బదిలీపై వెళ్లినట్లు సమాచారం. డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావుకు ఇన్‌చార్జి డీపీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో 61 గ్రామ పంచాయతీలుండగా ఇటీవల 28 గ్రామాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో 33 గ్రామాలు మాత్రమే మిగిలాయి. దీంతో జిల్లా అర్బన్ జిల్లాగా మారే అవకాశం ఉండటంతో పంచాయతీ అధికారులు జిల్లాలో పనిచేసేందుకు విముఖత చూపుతూ ఇతర జిల్లాలకు బదిలీ అయ్యేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

కీసరగుట్ట ఆలయ చైర్మన్‌గా తటాకం

» బాధ్యతలు స్వీకరించిన నారాయణ శర్మ



బాధ్యతలు స్వీకరిస్తున్న తటాకం నారాయణ శర్మ

కీసర, జనవరి6,(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా తటాకం నారాయణశర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వంశ పారంపర్యంగా వస్తున్న సంప్రదాయంగా ప్రకారం తటాకం నారాయణ శర్మతో ఆలయ మహా మండపంలో ఈవో సుధాకర్‌రెడ్డి ప్రమాణాస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్‌లతో పాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శాలువాతో సత్కారించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నారాయణ శర్మ దంపతులు గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేకపూజలు నిర్వహించి, ఆలయ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సభ్యులు, ప్రధాన అర్చకుడు బలరాం శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

కొడంగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇలవేల్పుగా వెలుగొందుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస రాజు అన్నారు. కొడంగల్ పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై సోమవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, గోపురాలు, మాడవీధులు తదితరాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌ను పరిశీలించి చర్చించారు. ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఉన్నారు.



ఆలయ అభివృద్ధి నమూనా మ్యాప్‌ను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు

రేపు వికారాబాద్‌లో జాబ్‌మేళా

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టెఫిన్స్ టైటాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం(ఐటీఐ) క్యాంపస్‌లో జనవరి 8 బుధవారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్టెఫిన్స్ టైటాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఐదు కంపెనీలు బిగ్ బాస్కెట్, స్విగ్గీ, జెప్టో, యురేకా ఫోర్బ్స్, డిమార్ట్ ఈ ఐదు కంపెనీలలో వేర్‌హౌస్ అసోసియేట్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, షిఫ్ట్ ఇన్‌చార్జి క్యాషియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇతర వివరాల కోసం మేళా నిర్వాహకుడు మియాసాబ్‌ను 9676047444 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా అల్పాహారం అందించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొడంగల్ నియోజకవర్గంలో ని పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లుగానే జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుదర్శన్‌లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను సోమవారం కలిసి ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలైన బకాయిలు విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీ రిపోర్ట్ తెప్పించి అమలు చేయడంతో పాటు పాఠశాలల్లో విద్యుత్ బకాయిలను రద్దు చేయించాలని స్పీకర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రఘునందన్‌రెడ్డి, మొగులయ్య, గోపాల్, మల్లారెడ్డి, దేవయ్య, శివప్ప, విష్ణువర్ధన్, బస్వరాజ్, సమీయొద్దీన్, బాబు, శ్రీనివాస్, వెంకటేశ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు దండిగా కంది

- కొనుగోలు కేంద్రంలో అందని 'మద్దతు'
- మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.8,600



మార్కెట్‌లో కందుల బస్తాలు, కొనుగోలు కేంద్రంలో తాళం వేసి ఉంచిన గోదాం

తాండూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు (గంజ్) కందుల రాకతో కళకళలాడుతోంది. కొన్నేళ్లుగా పంటలకు సరైన ధరలేక ఈ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరగలేదు. ఈ ఏడాది ప్రభుత్వం మద్దతు ధరకంటే ఎక్కువ గంజ్ మార్కెట్‌లో కందులకు ధర పలుకుతుండటంతో రైతులు క్యూకడుతున్నారు. తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోని మద్దతు ధర కంటే ఎక్కువగా వ్యాపారులు చెల్లిస్తున్నారు. క్వింటాల్ కందుల ధర తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం రూ.8600ధర పలికింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో తాండూరు డీసీఎంఎస్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7550 పలుకుతోంది. మార్కెట్ యార్డు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తేడా రూ.1050 ఉంది. దీంతో రైతులు వ్యవసాయ మార్కెట్‌లో కందులు విక్రయానికి మొగ్గు చూపుతున్నారు. మార్కెట్ (గంజ్)లోని రెండు షెడ్‌లు కందుల బస్తాలతో నిండి పోయాయి. రోజూ 2500 క్వింటాళ్ల వరకు కందులు క్రయ విక్రయాలు జరుగుతున్నాయి.

కొనుగోలు కేంద్రంలో కొర్రీలు

ప్రభుత్వ కందుల కొనుగోలు కేంద్రంలో నాణ్యత ప్రమాణాల పేరిట కొర్రీలు పెడుతున్నారు. తాండూరు డీసీఎంఎస్ కేంద్రంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. తేమ 12శాతం, ఇతర పదార్థాలు రెండు శాతం, దెబ్బతగిలిన గింజలు మూడు శాతం, రంగుపోయినవి, కొద్దిగా దెబ్బతిన్నవి నాలుగు శాతం, పక్వంకాని, ముడుకొని పాలు గింజలు మూడు శాతం, పురుగు పట్టిన గింజలు 1శాతం, ఇతర వంగింజలు మూడు శాతం నాణ్యత ప్రమాణాలు ఉండాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు ఏఈఓ ద్వారా ఆన్‌లైన్ ధ్రువీకరణపత్రం సమర్పించాలని నిబంధనలు పెట్టారు.

20ఏళ్లుగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం


జిల్లా కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న కేతావత్ గోవింద్ నాయక్

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం గత 20 సంవత్సరాల నుంచి తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ గోవింద్ నాయక్ తెలిపారు. సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తిమ్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా నేనావత్ రవికుమార్ నాయక్, గౌరవ అధ్యక్షుడిగా గోబ్రియ నాయక్, కోశాధికారిగా నీల్యానాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అంబర్ సింగ్ నాయక్, రాష్ట్ర కోశాధికారి కృష్ణ నాయక్, మేడ్చల్ జిల్లా టీజీయూఎస్ అధ్యక్షుడు రమేష్ నాయక్, హీరాలాల్, బాబుసింగ్, హరిలాల్, గోపాల్, వెంకట్, పాండు నాయక్, హీర్యనాయక్, నర్స్యనాయక్ పాల్గొన్నారు.

భారతీయ విలువలు పెంపొందించేందుకు కృషి


తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రేణుకాదేవి

వికారాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందించే విధంగా తపస్ కృషి చేస్తోందని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అంజిరెడ్డి, మహేంద్ర బహదూర్ అన్నారు. సోమవారం 2025 సంఘం క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంత్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశం, జిల్లా కోశాధికారి నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిలింగం, సంగమేశ్వర్, గోపాల్, లక్ష్మణ్, చంద్రశేఖర్, అనిల్, వీరేశ్, చిన్న కృష్ణ, సాయిబాబా శ్రీశైలం పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ శివ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన వైట్‌బెల్ట్ ఉన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కాచవాని సింగారం గ్రామంలోని నిహాక్ ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలకు చెందిన 17మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో నలుగురు స్వర్ణ పతకాలు, ఒకరు రజత పతకం, మరో 12మంది కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల యాజమాన్యం, కరాటే కోచ్ శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇబ్రహీంపట్నం-చౌటుప్పల్ బస్సును పునరుద్ధరించండి

ఇబ్రహీంపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం-చౌటుప్పల్ మధ్య నడిచే బస్సును తిప్పాయిగూడ మీదుగా పాత రూట్‌లో తిరిగి నడపాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం డిపో ఎదుట ఆందోళన చేశారు. కరోనా సమయం కంటే ముందు ఇబ్రహీంపట్నం-చౌటుప్పల్ (యాదాద్రి-భువనగిరి జిల్లా) బస్సు ఆరుట్ల, తిప్పాయిగూడ మీదుగా నడిచేదని.. తర్వాత బస్సును నడపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ కేపీవీ రాజు ఆర్టీసీ అధికారులతో ఈ విషయమై చర్చించగా సానుకూలంగా స్పందించినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య, జి.నర్సింహ, సుధాకర్, మాధవి తదితరులున్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ


డిపోలో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ అనూష

ఇబ్రహీంపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే వీలైనంతమేర రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఇబ్రహీంపట్నం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అనూష తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నం డిపోలో జరిగిన కార్యక్రమంలో డ్రైవర్లనుద్దేశించి ఆమె మాట్లాడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎం వెంకటనర్సప్ప, అసిస్టెంట్‌మేనేజర్ రాజేష్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతీ పల్లెకు 'ప్రగతిరథ చక్రాలు'



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ పల్లెకు ప్రగతిరథ చక్రాలు(బస్సులు) వస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని మక్తగూడ నుంచి కడుమూరు వరకు సోమవారం ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కొడంగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన లభించింది. అమర్‌రాజ్ కంపెనీ ప్రతినిధులు సోమవారం కడా కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 250కిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అందులో 25 సంవత్సరాలకు పైబడిన వారిని అనర్హులుగా తెలుపుతూ 130 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం 10నుంచి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అమర్‌రాజ్ కంపెనీ ప్రతినిధులు, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఏపీయం సిబ్బంది సహకారంతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన వారికి తిరుపతిలోని అమర్‌రాజ కంపెనీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం మహబూబ్‌నగర్‌లోని అమర్‌రాజ్ కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు.





ప్రతీ మెడికల్ షాపులో తనిఖీలు చేయలేం

" మెడికల్ షాపు నిర్వాహకులు నిబంధనలు పాటించడంలేదని పేరుతో సహా ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. ప్రతీ మెడికల్ షాపును తనిఖీ చేయలేం. మాకు ఇతర పనులు ఉంటాయి. మా పైఅధికారులకు సమాచారం అందిస్తాం. తదనంతరం చర్యలు తీసుకుంటాం.

- బి.ప్రవీణ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఉమ్మడి శామీర్ పేట్ మండలం

మెడికిల్ దందా!

పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు

- అర్హత లేకపోయినా మందుల విక్రయాలు
- పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నిర్వాహకులు
- ఆర్‌ఎంపీలతో కలిసి గుట్టుగా వ్యాపారం
- నిర్వాహకులతో ఔషధ నియంత్రణ అధికారుల కుమ్మక్కు!
- మూడుచింతలపల్లిలో మెడికల్ మాఫియా!

మూడుచింతలపల్లి, జనవరి6(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రబలుతున్న రోగాలను ఆసరాగా చేసుకుని మెడికల్ షాపు నిర్వాహకులు ఇష్టమొచ్చిన మందులను ప్రజలకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అర్హత లేకపోయినా ఎడాపెడా యాంటీబయోటిక్ మందులను విక్రయిస్తూ పేదల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. మూడుచింతలపల్లి మండల వ్యాప్తంగా మెడికల్ దందా జోరుగా సాగుతోంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా జబ్బు పేరు చెప్పగానే మోతాదుకు మించి డోస్‌లను ఇస్తూ పేదలను బలి తీసుకుంటున్నారు. ఈ వ్యాపారమంతా ఔషధ నియంత్రణ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

ఆమ్యామ్యాలకు అలవాటుపడి

ఇటీవల మూడుచింతలపల్లిలో ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు చేసి లైసెన్స్‌లేని ఓ క్లినిక్‌లో సుమారు రూ.40,000 విలువైన 50 రకాల యాంటీబయోటిక్ మందులను పట్టుకున్నారు. కాగా, మండల వ్యాప్తంగా ఎన్ని మెడికల్ షాపులు ఉన్నయో అధికారులకే తెలియని దుస్థితి. అధికారులు అన్ని మెడికల్ షాపుల్లో తనిఖీలు చేస్తే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని మందులు దొరక్క ఇబ్బందులు పడతారని సంబంధిత అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని స్థానికులు మండిపడుతున్నారు. అలాగే ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామని చెబుతుండటంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఫిర్యాదు చేస్తే ముందుగానే అధికారులు ఆయా మెడికల్ షాపు నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇస్తూ అప్రమత్తమయ్యేలా చేస్తున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఔషధ నియంత్రణ అధికారులకు నెలనెలా ముడుపులు ఇస్తూ మేనేజ్ చేస్తున్నారని అందుకే నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మెడికల్ షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు.

నామ్‌కే వస్తే తనిఖీలు..

వాస్తవానికి ఔషధ నియంత్రణ అధికారుల నుంచి లైసెన్స్ తీసుకొని మెడికల్ షాపును నిర్వహించాలి. నిబంధనల ప్రకారం అందులో ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. వారే మందులను విక్రయించాలి. కానీ నిర్వాహకులు అనుమతులు తీసుకున్నప్పుడు మాత్రమే నిబంధనలు పాటిస్తూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా నియంత్రణ అధికారులు మాత్రం మామూళ్లకు అలవాటు పడి అనుమతులు ఇచ్చేటప్పుడు మాత్రమే నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని చూస్తున్నారు తప్ప తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

ఆర్‌ఎంపీ డాక్టర్లను కలుపుకొని

మెడికల్ షాపు నిర్వాహకులు కొందరు ఆర్‌ఎంపీ డాక్టర్లను కలుపుకుని నెలవారి కమీషన్లతో పాటు మందుల విక్రయాలపై పర్సెంటేజీలు ఇస్తూ వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. కొంతమంది నిర్వాహకులు తాము అధికారులను సైతం నెలనెలా చూసుకుంటామని అన్నీ మేనేజ్ చేస్తామని హామీలు ఇస్తూ ఆర్‌ఎంపీ డాక్టర్లు చెయ్యాల్సిందల్లా తమ మెడికల్ షాపుల్లో లభించే మందులు మాత్రమే రాయాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఈ తతంగం అంతా మెడికల్ షాపు నిర్వాహకులే ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని ముందుండి నడిపిస్తున్నారనే సమాచారం. వీరందరికీ ఓ రాజకీయ పలుకుబడి ఉపయోగించి తెర వెనక చక్రం తిప్పుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

'హెరిటేజ్' ఆధ్వర్యంలో పాడి రైతులకు ప్రోత్సాహకాలు


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాంబశివరావు

మహేశ్వరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు ఎన్నో విధాలుగా లాభాలు చేకూరేలా ప్రోత్సాహకాలు అందిస్తుందని హెరిటేజ్ డెయిరీ అధ్యక్షుడు డాక్టర్ సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని సుభాన్‌పూర్‌లో పాడి రైతులతో హెరిటేజ్ సిబ్బంది పాల దిగుబడి, అధిక లాభాలు, డైరీ ప్రోత్సాహకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సబ్సిడీలో పశువుల కొనుగోలుకు రుణాలు, దానా, ఇన్సూరెన్స్, నట్టల మందులను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ.2లక్షల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తూ రూ.50లకే సెమిస్ అందిస్తూ రైతుల ఆర్థికాభివృద్ధికి హెరిటేజ్ డెయిరీ అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే పాల బిల్లులను 10 రోజులకోసారి నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ అయ్యే విధంగా చేస్తున్నామన్నారు. నర్సింగ్‌రావు, పవన్‌కుమార్, వెంకటేష్, రవీందర్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డితో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

దుద్యాలలో ఇండస్ట్రియల్ కారిడార్‌కు భూ సర్వే



దుద్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం అధికారులు భూసర్వే చేపట్టారు. పోలేపల్లి గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 67లోని ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం భూసర్వే నిర్వహించారు. రైతులు తమ భూముల హద్దులను అధికారులకు చూపించారు. ఇప్పటికే హకీంపేటలో 252 సర్వే నెంబరులో ఉన్న 351ఎకరాల ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే పూర్తయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్‌ఐలు నవీన్, రవీందర్‌చారి, నాగార్జున్‌రెడ్డి, వేణు, సర్వేయర్లు మహేశ్, ప్రవీణ్, మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చొరవతో మహానగరంగా మహేశ్వరం


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దేశానికే తలమానికంగా త్వరలో మహేశ్వరం మహానగరంగా మారబోతోందని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ప్రత్యేక దృష్టి సారించారని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.157 కోట్లు విడుదల చేయడాన్ని అభినందిస్తూ సోమవారం తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధి పనులు దేశానికే తలమానికంగా నిలుస్తాయని సీఎం తెలిపినట్లు కేఎల్లార్ చెప్పారు. 330 ఫీట్ల రోడ్డుకు ఈ నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ టు ట్రిబుల్‌ఆర్ వరకు విస్తరించే రోడ్డు, పలు రకాల పరిశ్రమలకు భూ సేకరణ సమస్య తలెత్తకుండా చూడాలని, రైతులు నష్టపోకుండా పరిహారంతో పాటు ప్లాట్లు, మహిళలకు సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఇవ్వాలని సీఎం నిశ్చయించారని చెప్పారు. మహేశ్వరం, కందుకూరు మండలాలను మున్సిపాలిటీలుగా మార్చడమా? ఫోర్త్‌సిటీ పేరుతో ప్రత్యేక కార్పొరేషన్ చేయడమా? అనేది ప్రభుత్వ పెద్దలు యోచిస్తున్నారని, త్వరలో ఆ నిర్ణయం కూడా వెలువడుతుందన్నారు. పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, కూన యాదయ్య, వత్తుల రఘుపతి, మురళీధర్‌రెడ్డి, కారి ఈశ్వర్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

రైతు భరోసాపై అపోహలొద్దు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు ప్రభుత్వం రైతు భరోసా కింద ఆర్థిక సాయం ఇస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం వల్ల గత పదేళ్ల రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. రూ.7లక్షల కోట్ల అప్పు ఉండగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ప్రజాపాలనను ప్రజలు ఆదరిస్తున్నారని, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వమని ప్రభుత్వం చెప్పడంతో గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ కవిత బీసీలపై కపట ప్రేమ ఒలకబోస్తున్నారని, ఆమె రాజకీయ పలుకుబడి కోల్పోయి బెంబేలు పడుతున్నారని తెలిపారు. బీసీలపై ప్రేమ ఉంటే కేటీఆర్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నుంచి తప్పించి బీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రేమ ఉన్నందుకే బీసీ కుల గణన చేస్తున్నారని తెలిపారు. రైతు భరోసా వల్ల కౌలు రైతులకూ మేలు జరుగుతుందన్నారు. నాయకులు కొంకళ్ల చెన్నయ్య, తిరుపతిరెడ్డి, బస్వం తదితరులు ఉన్నారు.

26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

- కమీషన్ల కోసమే బీఆర్ఎస్ పథకాలు
- త్వరలో కొత్త రేషన్ కార్డులు
- అప్పులున్నా అభివృద్ధి ఆగదు
- తాండూరు దిశ దశను మారుస్తా
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పెద్దేముల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): భూమిలేని వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని ఈనెల 26వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన సోమవారం పెద్దేముల్‌లో ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రైతులకు రూ.12వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు లేని వారికి త్వరలోనే కొత్త రేషన్‌కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన పథకాలన్నీ కమిషన్ల కోసమే తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. తనకు పదవి కోసం తాపత్రయం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తాండూరు నియోజకవర్గ దిశదశను మార్చడమే తన లక్ష్యమన్నారు. తాండూరులో తాండూరు-హైదరాబాద్ రోడ్డు, నియోజకవర్గ కేంద్రానికి అనుసంధానంగా రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, కాలుష్య నియంత్రణలో భాగంగా జినుగుర్తి వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో పాటు 30ఏళ్లుగా బషీరాబాద్ మండలం నీళ్లపల్లి, జలాల్‌పూర్, మైల్వార్, అటవీ సరిహద్దు సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా వ్యవసాయ సహకార సంఘాలను విస్తరణలో భాగంగా మంబాపూర్, కాశీంపూర్, పగిడ్యాల్, కరన్‌కోట్‌లలో నూతన సొసైటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గోట్లపల్లి మోడల్ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ధారాసింగ్, ఉత్తమ్‌చంద్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలి



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ ఈఈ విఠలయ్య

కీసర రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వాసులు డిమాండ్ చేసారు. చెర్లపల్లి నుండి రాంపల్లి మీదుగా కరీంగూడ వరకు ప్రభుత్వం రోడ్డు విస్తరణ చేపట్టిన విషయం తెలిసిందే. సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలో జాప్యం చేస్తుండటంపై స్థానికులు సోమవారం ఆర్ అండ్ బీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా తవ్వి వదిలేసిన గుంతలతో, మట్టి కుప్పలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేసారు. కాగా ఆర్ అండ్ బీ ఈఈ విఠలయ్య రాంపల్లికి చేరుకుని స్థానికులతో సమావేశమై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పార్కు పనులకు శ్రీకారం

తాండూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డులో గ్రీన్ బడ్జెట్ కింద కేటాయించిన రూ.6.50లక్షల నిధులతో చేపట్టే పనులకు చైర్‌పర్సన్ స్వప్న సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ మణిపాల్, కౌన్సిలర్లు సాహు శ్రీలత, ప్రభాకర్ గౌడ్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభరాణి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



పార్కు పనులకు భూమిపూజచేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

50వేల ఎకరాలకు 'రైతు భరోసా' కట్!

(5వ పేజీ తరువాయి)

వివరాల ప్రకారం రైతు భరోసా అందజేసేందుకు అధికారులు వివరాలు గుర్తించే పనిలో పడ్డారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 77,984 ఎకరాల భూమి ఉన్నది. ప్రతి సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు సాగు భూముల వివరాలను క్రాప్ సర్వేలో నమోదు చేస్తున్నారు. ఏఈవోలు ప్రతీ రైతు సాగు చేసే వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.



ఎకరాకు రూ.6 వేల చొప్పున

దాని ప్రకారమే జిల్లాలో వర్షాకాలంలో, యాసంగిలో ఎన్ని ఎకరాల్లో ఏ ఏ పంటలు సాగు అవుతుందో తెలుస్తుంది. దాని ప్రకారమే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు కావాల్సిన విత్తనాలను, ఎరువులను సిద్ధం చేస్తారు. ప్రస్తుత యాసంగి సీజన్ వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో కేవలం 19,756 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నట్లు ఇప్పటికే నివేదిక రూపొందించారు. ఆ నివేదిక ప్రకారం రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను సిద్ధం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో 19,756 ఎకరాల సాగు భూమికి మాత్రమే రైతు భరోసా అందనుంది. దీంతో దాదాపు 50 వేల ఎకరాలకు పైగా రైతుభరోసా నిలిచిపోనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 77,984 ఎకరాలకు ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.38.99 కోట్లు రైతుబంధు పంపిణీ జరిగేది. ఇప్పుడు 19,756 ఎకరాలకు ఎకరాకు రూ. 6 వేల చొప్పున రూ.14.81 కోట్లు రైతు భరోసా కింద జమ చేయాల్సి ఉంటుంది. దాదాపు రూ.24కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదా కానుంది.

గతంలో వెంచర్లు, రోడ్లు, గుట్టలకూ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో భూములున్న అందరికీ రైతుబంధు అందింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నగరశివారులో ఉండటంతో ఈ జిల్లాలో ఎక్కువగా భూములు లేఅవుట్లు, వెంచర్లు, విల్లాలు, పరిశ్రమలు, రింగురోడ్లు, విద్యా సంస్థలతో పాటు వివిధ ప్రాజెక్టుల కింద ఎక్కువ భూభాగం ఉండేది. లేఅవుట్లు, రోడ్లు, రింగురోడ్డు స్థలాలు కూడా రైతుబంధు చెల్లించారు. ఏళ్ల క్రితం క్రయవిక్రయాలు జరిగిన స్థలాలకు కూడా తమ పేర్ల పై భూములులేని వారికి కూడా రైతుబంధు అందింది. సాగులేని బంజరు భూములకు, రాళ్ల రప్పలకు, గుట్టలకు కూడా పెట్టుబడి సాయం ఇవ్వడంతో కోట్ల రూపాయలు దుర్వినియోగమయ్యాయి.

ధరణి వివరాల మేరకే..

ప్రస్తుతం సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు సాగు భూమి లెక్కలను తీసేందుకు ధరణిపైనే ఆధార పడనున్నట్లు తెలిసింది. ధరణిలో నమోదైన వివరాలను రెవెన్యూ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులకు అందజేస్తే ఆ వివరాలతో తమ వద్ద ఉన్న సాగు భూమి వివరాలతో పోల్చుకుని సరిచూడనున్నట్లు సమాచారం. ఆ తర్వాత తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిసింది.

పంట నమోదు వివరాలతో..

రైతుభరోసాకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. మార్గదర్శకాలు వచ్చిన తర్వాత జిల్లాలో సాగులో ఉన్న భూముల వివరాలను సేకరిస్తాం. ఇప్పటికే పంట నమోదులో సాగు వివరాలు మా వద్ద ఉన్నవి. రెవెన్యూ అధికారులు ధరణిలో ఉన్న వివరాలను అందిస్తే దాని ప్రకారం సాగు భూమి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తాం.

- చంద్రకళ, జిల్లా వ్యవసాయాధికారి

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

మూడుచింతలపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) జీవనోపాధి కోసం వచ్చిన కూలీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మజీద్‌పూర్ గ్రామానికి జీవనోపాధి కోసం వచ్చిన బిలాష్‌కుమార్ (23)ఓఇంట్లో అద్దెకు ఉంటూ స్థానికంగా ఉన్న హెచ్‌బీఎల్ కంపెనీలో కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం పని ముగించుకుని వచ్చిన తను పెంట్‌హౌస్‌లో టవల్‌తో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి రెండేళ్లు జైలు

కొడంగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ కొడంగల్ మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి శ్రీరామ్ సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ జీవీ. సత్యనారాయణ రెడ్డి తెలిపారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన బోయిని మొగులప్ప ఆగస్టు 29, 2016లో కొడంగల్‌కు వెళ్లగా ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అత్త బోయిని కళావతి ఇంట్లోకి వెళ్లి చూడగా గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి ఇంట్లో ఉన్న రెండు వెండి కడియాలు(30) తులాలు అపహరించుకెళ్లారు. చుట్టుపక్కల ఉన్న వారిని ఆరా తీయగా గుండ్లకుంట నర్సమ్మ, బచ్చనుల రాములు అనే వ్యక్తులు కుదురుమళ్ల గ్రామానికి చెందిన పంతులు మల్లేశ్ అనే వ్యక్తి ఇంటి ముందు నుంచి వెళినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి నేరబియోగపత్రము కోర్టులో సమర్పించగా నిందితుడు పంతులు మల్లేశ్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వివరించారు.

మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి



వికారాబాద్: ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్ విమర్శించారు. కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షులు నయీమ్, కౌన్సిలర్లు రామస్వామి, రాములు, నాయకులు పాండు, మేక చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గయాజ్ పాల్గొన్నారు.

తాండూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా పథకం కింద రూ.15వేలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త్యూర్ చంద్రయ్య డిమాండ్ చేశారు. వారు తాండూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అధికారం లోకి వచ్చే ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక రూ. 12 వేలు రైతు భరోసాగా ఇస్తామనడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ బషీరాబాద్ మండల అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

యాలాల: ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసా రూ.15వేలు వానాకాలం పంటతో కలిపి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కన్నారు. రైతుల ఆత్మహత్యలకు కనీస మద్దతు లేకపోవడమేనని రంగనాథన్ కమిషన్ గుర్తించిందని గుర్తుచేశారు.

మోమిన్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దబ్బాని వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం ముందు రైతులు, ప్రజా ప్రతినిధులతో కలిసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విఠల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

మర్పల్లి: రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదంటూ సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, మధుకర్, గఫార్, శ్రీనివాస్, అశోక్, జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోట్‌పల్లి: మండల పరిధిలోని కరీంపూర్ గ్రామంలో సోమవారం మండల అధ్యక్షుడు సుందరి అనిల్ ఆధ్వర్యంలో రైతులతోపాటు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని మాట తప్పిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సాదత్‌పటేల్, బీఆర్ఎస్ నాయకులు అహ్మద్ హుస్సేన్, ఫక్రుద్దీన్, అబ్బు, సిద్దిక్, కరీం, రషీద్, నర్సింహులు, ఏసు పాల్గొన్నారు.



తాండూరు: మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు మల్కయ్య, కొత్త్యూర్ చంద్రయ్య , తదితరులు

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్, జనవరి 6, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సూచించారు. 33వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కరన్‌కోట్‌లో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు కూడా 18ఏళ్లు నిండని పిల్లల చేతికి ద్విచక్రవాహనాలు ఇవ్వరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

కోట్‌పల్లి: సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ గఫర్ అన్నారు. మండలంలోని మోత్కుపల్లిలో సోమవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వదంతులను నమ్మవద్దని ఫేక్‌కాల్స్ వస్తే లిఫ్టు చేయవద్దని గుర్తుచేశారు. బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు.

'రక్షణ కల్పించండి'

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తమ వ్యవసాయ పనులకు అడ్డుపడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్న ఉమర్‌ఖాన్, అతడి అనుచరులపై చర్యలు తీసుకుని పేద రైతులను కాపాడాలని హైదరాబాద్, పూరానాపూల్‌కు చెందిన నరేశ్‌కుమార్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. తమ పొలాన్ని ఏవిధంగా తనపరం చేసుకోవాలని కుట్రచేస్తున్న వారి దుశ్చర్యల గురించి పలుమార్లు రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ ఆయన సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తాను, తన మేనకోడలు అపూర్వ, తమ బంధువు మహేశ్‌కుమార్ పూడూరు మండలం, చెన్‌గోముల్ గ్రామంలో 253/4/1, 253/5/1, 253/6/1, 253/6/1అ, 253/6/1ఆ, 253/6/2అ, 253/2/2ఆ, 253/7అ, 253/4/2, 253/5/2, 253/6/1ఆ, 253/6/2ఆ, 253/7/ఆ సర్వేనెంబర్లలో మొత్తం 5.22 ఎకరాలను 2017లో హైదరాబాద్‌కు చెందిన అస్గర్‌ఖాన్ నుంచి కొనుగోలు చేసి తామే కాస్తులో ఉన్నామని తెలిపాడు. తమ పొలం హద్దులను నిర్ణయించే సర్వే పనులను కూడా చేపట్టకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను వారికే అమ్మాలని, లేదంటే చంపేస్తామంటూ బెదిరిస్తున్నాడని తెలిపాడు.

ఓటరు ముసాయిదా తుది జాబితా విడుదల

కొడంగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ ఓటరు ముసాయిదా తుది జాబితాను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ విడుదల చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 2,46526 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 120879, మహిళలు 125640, ట్రాన్స్‌జెండర్స్ 7మంది ఉన్నట్లు తెలిపారు. 2024 ఓటరు ముసాయిదా జాబితా కంటే ఈసారి 3076మంది నూతన ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధారూరు: మండల ఓటరు జాబితాను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రదర్శించారు. ఫారం16 ఓటరు జాబితాను మండలంలోని 34 గ్రామ పంచాయతీలలో ప్రదర్శించామని తహసీల్దార్ సాజిదా బేగం తెలిపారు. మండలంలో మొత్తం 36,100 ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు17,739, మహిళ ఓటర్లు 18,361 మంది ఉన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి

దుద్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని ఎంఈవో విజయరామారావు అన్నారు. కుదురుమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత మేళ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ రఘుపతి, మాజీ ఎంపీటీసీ జనార్దన్‌గౌడ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. కరన్‌కోట్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అందించిన పదో తరగతి ఆల్‌ఇన్‌వన్ గైడ్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, హెచ్‌ఎం సాయప్ప, ప్రతాప్‌రెడ్డి, ప్రతిభ భారతి పాల్గొన్నారు.

రేపు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలి

తాండూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఈనెల 8వ తేదీ(రేపు) సాయంత్రం లోపు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి ఆదేశించారు. సోమవారం తన ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్ణీత గడువులోపు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మేనేజర్ నరేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రమేష్, టీఎంసీ రాజేందర్ ప్రసాద్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

కొడంగల్ మండల వ్యవసాయ అధికారిగా పూజ



కొడంగల్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల నూతన వ్యవసాయ అధికారి(ఏవో)గా బి.పూజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అన్నివేళల్లో అందుబాటులో ఉంటూ వ్యవసాయశాఖ పరంగా అన్ని సేవలను అందిస్తానని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఉద్యోగ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ధారూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో ధారూరు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల5న ఆదివారం వరంగల్ జిల్లా పర్కాల్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో మూడు పసిడి, మూడు వెండి, 9 కాంస్య పతకాలను సాధించి ఓవరాల్ ట్రోఫిని కైవసం చేసుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ మధు తెలిపారు.

నకిలీ విలేకరిపై చర్యలు తీసుకోవాలి

కీసర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నకిలీ విలేకరిపై తగిన చర్యలు తీసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్ సోమవారం కీసర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ అహ్మద్‌గూడ పరిధిలో తన ప్లాంట్‌లో గతంలో అహ్మద్‌గూడ పంచాయతీ అనుమతులతో ఇంటిని నిర్మించానని, అట్టి ప్లాంట్‌లో రెండు అదనపు గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపాడు. అహ్మద్‌గూడకు చెందిన నరేష్‌రెడ్డి ఓ టీవీ రిపోర్టర్ అంటూ డబ్బులు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వెంకటేష్ తెలిపారు.

అతివలే అధికం

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం ఆ సంఖ్య 45కు చేరినట్లు ప్రకటించారు. గతేడాది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 21 ఉండగా ఈ ఏడాది ప్రకటించలేదు. అలాగే సర్వీస్ ఓటర్లు 541 ఉండగా ఈ ఏడాది 549కు పెరిగింది. ఏడాదిలో మార్పులు చేర్పుల ప్రక్రియ అనంతరం పరిగి నియోజకవర్గంలో 36,675 మంది ఓటర్లు పెరిగారు. వికారాబాద్ నియోజకవర్గంలో 20,486 మంది ఓటర్లు, తాండూరు నియోజకవర్గంలో 30,735 మంది, కొడంగల్ నియోజకవర్గంలో 30,735 మంది ఓటర్లు పెరిగారు.

పరిగిలో కేవలం ఆరుగురే..

జిల్లాలో పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా నమోదయ్యారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా తాండూరు నియోజకవర్గంలో నమోదు కాగా, అత్యల్పంగా పరిగి నియోజకవర్గంలో ఉన్నారు. తాండూరులో 8,128 మంది, కొడంగల్‌లో 4,761 మంది, వికారాబాద్‌లో 2,136 మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. కాగా, పరిగి నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే కేవలం ఆరుగురు మహిళా ఓటర్లే అధికంగా నమోదయ్యారు. ఎన్నికల్లో అభ్యర్థుల విజయావకాశాలు మహిళా ఓటర్ల నిర్ణయంపైనే ఆధార పడనున్నాయి. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పరిగిలో 305 పోలింగ్ కేంద్రాలు, వికారాబాద్‌లో 284 కేంద్రాలు, తాండూరులో 269 కేంద్రాలు, కొడంగల్ నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాల చొప్పున ఉన్నాయి.

నియోజకవర్గం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	సర్వీస్ ఓటర్లు
పరిగి	1,35,522	1,35,528	10	247
వికారాబాద్	1,16,388	1,18,524	21	79
తాండూరు	1,19,824	1,27,952	07	53
కొడంగల్	1,20,879	1,25,640	07	170
మొత్తం	4,92,613	5,07,644	45	549

మేడ్చల్ ఓటర్లు 29,48,537



మేడ్చల్ ప్రతినిధి, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఓటర్ల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది. 2025 జనవరి 5వ తేదీ వరకు అధికారిక లెక్కల ప్రకారం ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 29,48,537 మంది ఓటర్లున్నారు. అందులో పురుషులు 15,17,375 మంది, మహిళలు 14,30,746 మంది, 416 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 7,34,015 మంది ఓటర్లు, అత్యల్పంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో 4,86,049 మంది ఓటర్లు నమోదయ్యారు. మేడ్చల్ నియోజకవర్గంలో 6,72,376 మంది ఓటర్లు, మల్కాజిగిరి నియోజకవర్గంలో 5,13,114 మంది ఓటర్లు, ఉప్పల్ నియోజకవర్గంలో 5,42,947 మంది ఓటర్లు నమోదయ్యారు. కాగా, గత రెండు నెలల్లో జిల్లాలో 7,614 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు.

డ్రైనేజీ సమస్య తీర్చాలి



ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

శామీర్‌పేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లి 15వ వార్డులో గల ఎల్ ఆర్ గ్రీన్ హోమ్స్, న్యూ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సోమవారం ఆ కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఎల్‌ఆర్‌గ్రీన్ హోమ్స్ కాలనీ అధ్యక్షుడు గోపు శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కాలనీలో రెండేళ్లుగా సరైన డ్రైనేజీ, వీధిలైట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, అరుణ్‌నాయక్, ఆంటోని పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బాధితులకు పరామర్శ

కోట్‌పల్లి: మండలంలోని బార్వాద్ గ్రామంలో ఆదివారం రిటైర్‌టీచర్ సీనియర్ నాయకులు తేనె చంద్రారెడ్డి, అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి సోమవారం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దోమ: మండలంలోని దిర్సంపల్లి గ్రామానికి చెందిన కోళ్ల చెన్నమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కేఎస్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ గ్రామానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగం, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

దౌల్తాబాద్: ఆర్‌బీఎస్‌కే రాష్ట్రీయ బాలస్వస్థ్ కార్యక్రమంలో భాగంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలతో విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాయమ్మ, మాజీ సర్పంచ్ శిరీష రమేశ్, వైద్యులు శ్రీకాంత్, రఘువీర్, ఏఎన్‌ఎం ఎల్లమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

మోమిన్‌పేట్: రైతులు పండించిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి జయశంకర్ తెలిపారు. మండలంలోని సయ్యద్ అలీపూర్ గ్రామంలో పంట వివరాలను ఏఈవోలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అలవెన్స్ కల్పించాలి

బొంరాస్‌పేట్: ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న నూతన ఉపాధ్యాయులకు హెచ్‌ఎం అలవెన్స్ కల్పించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశమయ్యారు. సమగ్రశిక్షా ఉద్యోగులు సమ్మెలో ఉండగా పంపిణీ చేయాల్సిన మధ్యాహ్నా భోజన నిర్వహణ బకాయిలు చెల్లించాలని కోరారు.

ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు

కొడంగల్: కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆర్టీసీ కంట్రోలర్ పీఎస్.రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్‌ఐ జీవీ.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని అన్నారు. మున్సిపాలిటీలోని బాలాజీనగర్‌లో సోమవారం ఆమె విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించారు. ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మత్తు చేసి సమస్యలు పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ రవి, మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గిరిజన ఉపాధ్యాయ సంఘం ఎన్నిక

దోమ: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని దోమ మండల కేంద్రంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూర్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా గోపాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా బాలు, కోశాధికారిగా నెహ్రూ, ఉపాధ్యక్షుడిగా శంకర్, రాజు, మీడియా కన్వీనర్‌గా బాలురాథోడ్, సాంస్కృతిక కార్యదర్శిగా రాజు, మండల కార్యదర్శిగా రాజ్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సంధ్యారాణి, శోభను వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్, ప్రధానకార్యదర్శి కాల్యానాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌కు సన్మానం

కులకచర్ల: బండవెల్కిచర్ల పాంబండ ఆలయాన్ని నారాయణపేట జిల్లా కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పాండుశర్మ వారికి దర్శనం కల్పించారు. శ్రీ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఘట్‌కేసర్: పోచారం పరిధిలో నారపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు(మంగళవారం) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరాఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్ సోమవారం ఓప్రకటనలో పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కులకచర్ల: మండలంలోని కామునిపల్లిలో శాగంటి లక్ష్మీ నర్సిములకు సీఎం సహాయ నిధి మంజూరైన రూ.22వేల 500 చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోర వెంకటేశ్, నాయకులు బాల్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాములు, రాజు, మొగులయ్య, లాలయ్య, రాములు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.